# ఆప్త మిత్రులు

### తాళ్లూరి నాగేశ్వరరావు



భూషయ్యా, భుజంగరావూ ఆప్త మిత్రులు. ఇద్దరిదీ ఒకేఊరు. వారిది ఇరుగూ పొరుగూ కాకపోయినా, వాళ్ళ స్నేహాన్ని గట్టిపర్చింది తుమ్మ గుంట పొలం. అక్కడ గట్టు హద్దుగా చెరి మూడెకరాల శేరీ మాగాణిభూమి ఉంది. ఇద్దరూ వ్యవసాయదారులే. ఊడ్పుల దగ్గర్నుంచీ మాసూలువరకూ ఇద్దరూ చేదోడు వాదోడుగా సేద్యపు పనుల్ని చేసుకుంటూవుంటారు. వాళ్ళ సఖ్యతా, స్నేహమూ అక్కడే ఆరంభమైంది. ఆయేటికాయేడు అది కొమ్మలూ రెమ్మలూవలె వృద్ధిచెందింది. ఒకతల్లి బిడ్డలు కాకపోయినా, అంతకు మరింత యిదిగా అన్నదమ్ములవలె మెలుగుతూ ఉంటారు.

భూషయ్యకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు ఇంజనీరింగ్ ఫైనల్ యియర్ చదువుతున్నాడు రెండోవాడు మెడిసిన్. పెద్దవాడు పెళ్ళీడుకొచ్చాడు.

భుజంగరావుకు ముగ్గురు కొడుకులు. పెద్దవాడు ఇంజనీరింగ్ ఫైనలుయియర్ చదువుతున్నాడు. రెండోవాడు మెడిసిన్. మూడోవాడు పి. యు. సి. పెద్దవాడు పెళ్ళివయస్సులోనే ఉన్నాడు.

భుజంగరావుకంటె భూషయ్యే స్థిర చరాస్తులలో మిన్న. భూషయ్యకంటె భుజంగరావు ఓ మోతాదు ఎక్కువ వ్యవహారదక్షత గలవాడు. భూషయ్య చదువు వీధిబడి దాటలేదు. భుజంగరావు సర్కారువారి బడిలోకూడా రెండేళ్ళు చదువుకున్నాడు.

మిత్రు లిద్దరూ తమతమ పెద్దకొడుకుల్ని ఓ ఇంటివాళ్ళని ఆయేడు చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు.

ఆరోజు కడసంజెవేళ మిత్రులిద్దరూ తుమ్మగుంటపొలం దగ్గర్నుంచి ఊళ్లోకి వస్తున్నారు.

"భూషయ్యా: పాలెం మున్సబు నీకు ఎరుకగదూ! ఆయనకు పెళ్ళీడు కొచ్చిన ఓ పిల్ల ఉంది. పుత్తడిబొమ్మ. కట్నంకూడా 'ల'కారంమీదే! గుంటూరులో స్త్రీల కళాశాలలో బి. ఏ. మూడో సంవత్సరం చదువుతూన్నదట. గుణవతీ, రూపవతీ, విద్యావతీ; ఆ పైన ధనలక్ష్మి - ఆ పిల్లను మా పెద్దవాడికి ఇస్తామంటూ మున్సబు కబురుచేశాడు," అన్నాడు భుజంగరావు తాపీగా.

"ఏమన్నావ్?" అన్నాడు భూషయ్య ఆదుర్దాగా.

"అక్కర్లేదన్నాను," అన్నాడు భుజంగరావు పట్టు కత్తిరించినట్టు.

భూషయ్యకు గుటక పడలేదు. "ఏం?"

"అక్కడే ఉంది అసలు కిటుకు. అందరూ నన్ను పిచ్చివాడిక్రింద జమ కడతారు. నిజం తెలుసుకుంటే నన్నే వ్యవహారజ్ఞాని అంటారు. మా బావమర్ది అంతా వాకబు చేసి, నా చెవిలో అసలు రహస్యాన్ని వూదాడు. ఆ పిల్ల జాతకంలో పెళ్ళిఅయిన అయిదేళ్ళకు వైధవ్యం వ్రాసిపెట్టబడి ఉందట. అంటే ఆ జాతకప్రభావంవల్ల ఆమెను కట్టుకున్న మొగుడు అయిదేళ్ళల్లో 'హరీ' అనవల్సిందేగదా! చూస్తూ చూస్తూ ఆ సంబంధము చేసి ఏ తండ్రి తన కొడుకుమరణాన్ని కోరుకుంటాడు? ఏమంటావు భూషయ్యా?" కనుబొమ్మలు ఎగురవేస్తూ అన్నాడు భుజంగరావు.

భూషయ్యకు గుటక పడింది.

"అవును, మరి అంతే!"

ఆ మిత్రు లిద్దరిమధ్యా ఆ సంభాషణ జరిగిన వారం రోజులకు భూషయ్య ఇంటికి పాలెం మున్సబు దగ్గర్నుంచి ఓ పెళ్ళిళ్ళపేరయ్య వచ్చాడు. మున్సబుగారు తమ అమ్మాయిని లక్షరూపాయల కట్నంతో ఇంజనీరింగ్‌చదివే భూషయ్యగారి పెద్దబ్బాయికి ఇవ్వడానికి సిద్ధంగా వున్నట్టు తెలియబర్చాడు. భూషయ్యకు వెన్నుపాము విరిగినట్టై, ససేమిరా ఆ సంబంధం తమకొద్దని మొహంపై పేడనీళ్ళు చల్లినట్టుగా చెప్పాడు. పాపం! ఆ పెళ్ళిళ్ళ పేరయ్యకు నిలువునా నడుములు క్రుంగగా, కాళ్ళీడ్చుకుంటూ భుజంగరావు దగ్గర కెళ్ళి, ఓ గంటసేపు ముచ్చట్లు ఆడాడు. ఆ పిమ్మట పాలెం వెళ్లాడు.



ఓ నెల రోజుల తర్వాత పాలెం మున్సబు కూతురికీ భుజంగరావు పెద్ద అబ్బాయికీ పెద్దల సమక్షాన వైభవంగా వివాహం జరిగింది.

తలవాకిటి చావడి దూలం నుదురుకు కొట్టుకున్నంతగా దిమ్మరపోయాడు భూషయ్య.

"ఏమిటి భుజంగరావ్! ఆ పిల్ల జాతకంలో పెళ్ళి అయిన అయిదేళ్ళకు వైధవ్యం ఉందని నాతో అన్నావ్. మరి చూస్తూ చూస్తూ నీ కొడుక్కి చేసుకున్నావేం?"

తన మిత్రుని అమాయకత్వానికి భుజంగరావు చిక్కగా చిరునవ్వు నవ్వాడు.

"అదేమో నాకు వివరంగా తెలియదు. మా వాడి జాతకాన్ని తిరగవేశాను. వాడికి పెళ్ళిఅయిన అయిదేళ్ళకే ద్వితీయ వివాహ మున్నట్టు ఖచ్చితంగా ఉంది."

భూషయ్యకు నోరెండిపోయింది.

——